క్లుప్తంగా

బాలికల హాస్టల్ తనిఖీ

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను ఎంపీడీఓ విజయారావు, మండల ప్రత్యేక అధికారి పవన్ కుమార్ రెడ్డిలు గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

తాగునీటి కుళాయిలు ఏర్పాటు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ కొత్తపల్లి ఎగువ ముస్లిం కాలనీలో గత రెండు రోజుల నుంచి తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ వైస్ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపూరు చిన్నవెంగల్ రెడ్డి దృష్టికి తాగునీటి సమస్యలను ముస్లిం వీధిలోని ప్రజలు విన్నవించడంతో వెంటనే ఆయన స్పందించి తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయించారు.

ఖాకీలకు వైద్య పరీక్షలు

రాజంపేట : రాజంపేట ప్రాంతీయవైద్యశాలలో ఖాకీలకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవలందించే పోలీసులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్యం స్థితిగతులను తెలుసుకుంటూ ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.పీవీఎస్ రాజు, ప్రముఖ వైద్యుడు డా.చట్టేటి అనిల్ తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

రాయచోటి టౌన్ : జీఓ నంబర్ 36ను అమలు చేయాలంటూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. గురువారం నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ విజయవాడలోని డీఎంఏ ఆఫీస్ వద్ద ధర్నాకు భారీ ఎత్తును కార్మిక సంఘ నాయకులు వెళ్లారని తెలిపారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

గాలివీడు : కరువు తాండవిస్తున్న అన్నమయ్య జిల్లాపై ప్రభుత్వం కనికరం చూపకపోవడం దారుణమని, వెంటనే రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన వారాంతపు పశువుల సంతను పరిశీలించి, పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బీమా సౌకర్యం ఉండాలి

గాలివీడు : ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక బీమా సౌకర్యం కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాలివీడు బ్రాంచ్ మేనేజర్ శేషం ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పేరంపల్లి పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా సామాజిక భద్రతా పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరు బీమా కలిగి ఉండాలని, బీమా వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. బీమా లేనివారు బ్యాంకులో గాని, ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో గాని చేసుకోవచ్చునని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితంగా ఉంటుందని లక్కిరెడ్డిపల్లి కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలాఫర్ బేగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని విధాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించాల్సిన అవసరం లేదని, కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సమాచారం చాలా మంది తెలియని వారు డబ్బులు పెట్టి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని, ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతనమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలియజేశారు.

నియామకం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షులుగా మీగడ శివారెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వచ్చే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లతో కలిసి పోరాడుతామని పేర్కొన్నారు.

సబ్ జైల్ తనిఖీ

రాయచోటి టౌన్ : రాయచోటి సబ్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. గురువారం ఆయన జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జైలు లోపల వారికి ఉన్న హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై అవగాహన కల్పించారు. అలానే వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైల్ పరిసరాలను పరిశీలించారు. జైల్ల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనను అంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- చంద్రబాబు మోసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఆదేశం



చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, మండల నాయకులు

వీరబల్లి : రాష్ట్రంలో కొనసాగుతున్న చంద్రబాబు నాయుడు దుర్మార్గపు పాలనను అంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట నియోజకవర్గ శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి పిలుపునిచ్చారు. వీరబల్లి మండలంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పార్టీ శ్రేణులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అమలు చేయలేని హామీలను ఎన్నికల ముందు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో 140 పథకాలు అందిస్తామని ఆశచూపి ఇప్పుడు కొన్ని పథకాలు అమలు చేసి అన్ని చేసేశామని ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం వంచన చేసిందని పేర్కొన్నారు. రైతులు మునుపెన్నడూ లేనివిధంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేక రోడ్డు ఎక్కుతుంటే పోలీసులతో అణచివేసే ధోరణిని ప్రభుత్వం అవలంభిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందని, రైతులు లాభాలు చూశారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు వేదనకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని వివరించారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు, పేద, మధ్య తరగతి ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో చేసిందేమీలేదని, వారి బాగోగులు చూసుకున్నది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఆకేపాటి తెలియజేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వేధింపులు

ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని, కానీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే మాత్రం కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నట్టు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆకేపాటి అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులే కాకుండా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారిని, జర్నలిస్టులను సైతం వదలకుండా అక్రమ కేసులు బనాయిస్తూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్నారు. తమ నాయకులను వేధించడంలో పెట్టిన శ్రద్ధ ప్రజలకు మంచి చేయడంలో చూపాలని ఆకేపాటి సూచించారు.

మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏడాది కాలంగా కూటమి చేసిన విధ్వంసక, ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గడపకు చంద్రబాబు మోసాలను తెలియజేయాలన్నారు. అరాచక ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దురాగతాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలన్నారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్‌లను ఆయన నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరీష్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ సభ్యులు శివరాం, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరనాగిరెడ్డి, రాష్ట్ర యువత విభాగం ప్రధాన కార్యదర్శి వివేకానందరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడం నాగభూషణం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణిరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుళాయిరెడ్డి, ధర్మారెడ్డి, సోషల్ మీడియా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నరేష్ స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్‌ఆర్‌సీపీ మండల స్థాయి సమావేశం

నందలూరు : వైఎస్‌ఆర్‌సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, నందలూరు మండలాధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొననున్నట్లు చెప్పారు. మండలంలోని వైఎస్‌ఆర్‌సీపీ కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తప్పకుండా హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

కరదీపికలు పంపిణీ

నందలూరు : నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ ప్రిన్సిపల్ గంగనపల్లి వెంకటరమణ ఉపాధ్యాయులకు కరదీపికలను గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 6 నుంచి 10 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సమగ్ర శిక్ష వారు ఉపాధ్యాయ కరదీపికలను రూపొందించి పాఠశాలలకు చేరవేసిందన్నారు. కార్యక్రమంలో గ్లోరీ కిరణ్ ఉజాల, శిల్పి ఆనందాచారి, జీవీ ప్రసాదరావు, ఆర్.రమణమ్మ, గొంటుముక్కల వెంకటరమణ, గీత, జ్యోతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద కుటుంబాలను ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి

రాజంపేట టౌన్ : ఈనెల 13వ తేదీ రాత్రి రెడ్డిపల్లె చెరువుకట్టపై ఐచర్ లారీ బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన తొమ్మిది మంది కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించడం తప్ప నయా పైసా సహాయం చేసిన పాపాన పోలేదన్నారు. మృతులంతా యానాది కులానికి చెందిన వారని, వారికి పనిచేసుకొని జీవించడం మినహా మరేమి తెలియదన్నారు. ఘటన జరిగి దాదాపు వారం రోజులు కావొస్తున్న యానాది కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎందుకు చిన్నచూపు చూస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు హితోదికంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మామిడి రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన బంగారుపాళ్యం పర్యటనలో టీడీపీ అనుకూల పత్రిక ఫొటోగ్రాఫర్‌పై దాడి జరిగిందంటూ చెప్పుకుంటూ నానా రాద్ధాంతం చేసిన కూటమి ప్రభుత్వం వెను వెంటనే స్పందించి సదరు వ్యక్తికి రూ.2 లక్షలు నష్ట పరిహారం ప్రకటించడమే కాక అందజేయడం కూడా జరిగిందని కానీ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యానాదులను ఆదుకోవడంలో ఎందుకు చొరవ తీసుకోలేదో తెలియజేయాలన్నారు. అలానే ప్రమాదంలో గాయపడిన వారి పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని మండిపడ్డారు. క్షతగాత్రులకు కార్పొరేట్ వైద్యం అందించి భరోసానివ్వాల్సింది పోయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించి చేతులు దులుపుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. పేదల ప్రాణాలంటే ఎంత చులకనో ఈ సంఘటనలో ప్రభుత్వం అనుసరించిన తీరు తేటతెల్లం చేసిందని పేర్కొన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధించడంలో చూపుతున్న శ్రద్ధ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవడంలో చూపాలని తెలియజేశారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

రాజంపేట టౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో గురువారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజంపేట పట్టణంలోని వత్తలూరు రోడ్డు సర్కిల్‌లో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయన్నారు. దీంతో పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువు మానేసే పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీను, చందు, హరినాథ్, సుధీర్, కల్యాణ్ రామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అభిరామ్, హర్ష, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



పుల్లంపేట: బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది



ఒంటిమిట్ట: సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎల్‌డీఓ మైథిలి

ఒంటిమిట్ట : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తనకు అప్పజెప్పిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని డీఎల్‌డీఓ మైథిలి అన్నారు. సచివాలయ ఉద్యోగులు బదిలీ అయిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ఒంటిమిట్ట సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సిబ్బందికి ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎల్‌డీఓ మైథిలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సచివాలయంలో బదిలీపై వెళ్లిన అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియదర్శిని, ఏఎన్‌ఎం రాజేశ్వరీ, మహిళా కానిస్టేబుల్ సుజాత, వెల్ఫేర్ అసిస్టెంట్ యశ్వంత్, డిజిటల్ అసిస్టెంట్ నాగేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిదీప్, సర్వేయర్ సాయిలను శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.

పుల్లంపేట : మండలంలోని కొండపల్లి గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో గత ఎనిమిది సంవత్సరాలుగా పాఠశాలలోని విద్యార్థులకు విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీదేవి, వల్లూరు సిద్దయ్యలు గురువారం బదిలీ కావడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సహకారంతో పాఠశాల సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు.

ప్రతి గడపకు చంద్రబాబు మోసాలు

- గ్రామగ్రామానికి ప్రభుత్వ వైఫల్యాలు
- కార్యకర్తలకు ఎమ్మెల్యే ఆకేపాటి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

సుండుపల్లె : ప్రతి గడపకు చంద్రబాబు చేసిన మోసాలను తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో కూటమి అనుసరిస్తున్న దగాకోరు పాలనను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో శ్రేణులకు విశదీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట నియోజకవర్గ పరిశీలకురాలు అనిషారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ ప్రజలకు చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్తున్నట్లు వారు తెలిపారు. సంవత్సర కూటమి పాలనతో ప్రజలందరూ విసిగిపోయారని వైఎస్ జగన్ సంక్షేమ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తిరస్కరిస్తున్నారని విమర్శించారు. కరోనా కష్టకాలంలోనూ అన్ని వర్గాలకు సంక్షేమం అందించింది వైఎస్ జగన్ అయితే, ఏడాది పాలనలో రూ.1.75 లక్షల కోట్లను అప్పుగా తెచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో అర్థం కావడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సుండుపల్లె మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఆరంరెడ్డి, జిల్లా గిరిజన విభాగం అధ్యక్షుడు చంద్రనాయక్, రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, కోఆప్షన్ కలీం బాషా, వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, సర్పంచ్ రామాజయచంద్ర, ఎంపీటీసీలు నాగేశ్వరరావు, బాబురెడ్డి, ఆదామ్‌ఖాన్, శేఖర్‌రెడ్డి, రెడ్డమ్మ, అబ్దుల్లా, రఫీక్, ఖలీల్, రహీంబాషా, బాబురెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారుల ప్రమాదాలను తగ్గించాలి

రాయచోటి : రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలను చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు జాతీయ, రాష్ట్ర రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్లపై చర్యలు తీసుకోవాలని, మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడంపై పర్యవేక్షణ పెంచాలని జేసీ సూచించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి రహదారులపై భద్రత కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రహదారులపై ప్రమాదాల వివరాలు, హిట్ అండ్ రన్ కేసులు, రహదారులపై భద్రత అవగాహనా కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్లపై (ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలు) తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్‌కు జిల్లా ఆర్ అండ్ బీ అధికారి సహదేవరెడ్డి వివరించారు.

పంచాయతీ పురోగతిపై వర్క్‌షాప్

పుల్లంపేట : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, ఏఎన్‌ఎంలకు స్థానిక పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకారం ఇచ్చేందుకు, 2030 నాటికి గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలుకు సహకరించే విధంగా ప్రభుత్వం పంచాయతీ పురోగతి సూచిక 2.0 వర్షన్ రూపొందించి శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీధర్ రెడ్డి, కె ముత్తయ్య, మహేష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనంపై ప్రత్యేక దృష్టి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డైట్ సీనియర్ లెక్చరర్ ఎం.నర్సింహారెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణం కొత్తపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై అధ్యయనాన్ని డైట్ తరఫున ఆయన చేపట్టారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరగతి వారీ చార్టులు, కథల పుస్తకాలు, డ్రాయింగ్, పెయింటింగ్ సామాగ్రి, వర్క్ షీట్లు, వర్క్‌బుక్కులు, పోస్టర్లు, క్రాఫ్ట్ వస్తువుల వంటి అభ్యసన సామగ్రిని ప్రతి విద్యార్థికి సమకూర్చాలన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని ప్రాథమిక విద్యాభివృద్ధికి కృషి చేయాలని డైట్ సీనియర్ లెక్చరర్ ఎం.నర్సింహారెడ్డి సూచించారు. అర్చన కళాశాలలో జిల్లాలోని 280 మంది మోడల్ ప్రాథమిక పాఠశాలల, ఉన్నత ప్రధానోపాధ్యాయులకు గత నాలుగు రోజుల నుంచి నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు కేటాయించడం వలన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి మోడల్ ప్రాథమిక పాఠశాలలు తోడ్పడుతాయన్నారు. నూతనంగా ఏర్పడిన ఈ మోడల్ ప్రాథమిక పాఠశాలలకు మౌలిక సదుపాయాలను కల్పించుకుని విద్యార్థులలో అభ్యసన ఫలితాలను అభివృద్ధి చేయాలన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

సిద్దవటం : శక్తి యాప్ విద్యార్థినులకు రక్షణ కవచం లాంటిదని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ కడప యూనిట్ సీఐ ఐదురు బాషా తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థినులకు గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేసినా, ర్యాగింగ్‌కు పాల్పడిన కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే బాల్య వివాహాలు, సెల్‌ఫోన్ వినియోగం, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కల్పించి, పిల్లలకు అమూల్యమైన సలహాలు, సూచనలు తెలియజేశారు. పిల్లలపై ఏదైనా అఘాయిత్యం జరిగితే 1098, 1122, 100కి సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : పార్వతీపురంలో వెలసిన శీతల గంగమ్మ జాతర సందర్భంగా గురువారం భక్తులు వైభవోపేతంగా పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు, కోడిపుంజులు, మేకపోతులను బలిచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు.



అమ్మవారి దర్శనార్థం బారులు తీరిన భక్తులు

నీటికోసం బోరుమంటున్న ప్రజానీకం

- గుక్కెడు నీటికై రోడ్డెక్కుతున్న మహిళలు
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహిళల నిరసన
- ప్రైవేటు సిబ్బందితో నీటి సరఫరా



దూదేకుల కాలనీలో ఉచిత నీటి ట్యాంకు వద్ద బారులు తీరిన మహిళలు



కృష్ణాపురంలోని దుర్గమ్మ గుడి వద్ద ఖాళీ బిందెలతో మహిళల నిరసన

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణ ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు. 36 జీఓ అమలుకోసం రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో 5వ రోజుకు చేరుకుంది. తాగునీటి కోసం పట్టణంలోని పలు వార్డులకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. మరికొంత మంది మహిళలు మూడు రోజులుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియపరిచి, నీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. గురువారం కూడా మూడు వార్డులకు చెందిన మహిళలు కలెక్టర్ కార్యాలయం ఎదుట తాగునీటికోసం ధర్నా నిర్వహించారు. సాధారణంగానే రాయచోటి మున్సిపాలటీ పరిధిలో వారం, పదిరోజులకు ఒకసారి నీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలకు ఐదు రోజులుగా నీరు రాక నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. 34 వార్డులు ఉన్న మున్సిపాల్టీలో 25 వేల కుటుంబాలలో లక్ష ఇరవై వేల మందికిపైగా జనాభా నివాసిస్తున్నారు. వారందరికీ తగినంత నీరు అందక తాగునీరు ఇంటి అవసరాల కోసం, నీటి కోసం పరితపించాల్సి వస్తోంది. ఏ వార్డు వీధికెళ్లినా కన్నీటి కష్టాలే దర్శనమిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నామంటూ స్థానికులు బోరుమంటున్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యను అధికమించేందుకు మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నేతలు తగిన చర్యలు తీసుకోవడంతోనే ఈ సమస్యలు ఉత్పన్నమయ్యాయని విమర్శించారు. ఇతర మున్సిపాల్టీలలో ముందు జాగ్రత్తగా అధికారులు ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేయనున్నారు. మంత్రి సొంత నియోజకవర్గమైన మున్సిపాల్టీలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో తాగునీటి కష్టాలు తారాస్థాయికి చేరాయని మహిళలు మండిపడ్డారు. పట్టణంలో నెలకొన్న తాగునీటి కోసం స్థానిక ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. అలానే టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ట్యాంకర్లతో కొన్ని ప్రాంతాలలో ఉచితంగా నీటిని అందిస్తున్నారు.

20 రోజులుగా రాని చుక్క నీరు

పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ, కృష్ణాపురం ప్రాంతాలలో ఇరవై రోజుల నుంచి నీరు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నామని కృష్ణాపురం మహిళలు తెలిపారు. గురువారం మహిళలు నీటిని అందివ్వాలంటూ సమీపంలోని దుర్గమ్మ గుడి ఎదుట ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. మంత్రి సమస్యలు గుర్తించి తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని, కృష్ణాపురంలోని గంగమ్మ దేవాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. కాగా మున్సిపాలిటీ పరిధిలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం జిల్లా జాయింటడ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు తాగునీటి సమస్యను వివరించారు. 15 రోజులుగా నీరు రాక తీవ్రమైన తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 11, 12, 18 వార్డులలో 20 రోజులుగా నీరు రాకపోవడంతో అక్కడ నివసిస్తున్న నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి..

కార్మికుల సమస్యలను పరిష్కరించి పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని మాసాపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు సుగవాసి శ్యామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవాజ్ క్రిష్‌లు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. తాగునీటి సమస్య పరిష్కారంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ తరఫున నాయకులు సహకరిస్తామని గురువారం మీడియా ముందు తెలియజేశారు. ప్రైవేటు సిబ్బందితో నీటిని సరఫరా చేస్తున్నాం, రాయచోటిలో మంచినీటి సమస్యను అధికమించేందుకు అన్ని చర్యలు చేపడతున్నామని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తెలిపారు.

నీళ్లు నిలిచే.. అవస్థలు తెచ్చే



చిన్నపాటి వర్షానికే జలమయమైన వైకోటకు వెళ్లే ప్రధాన రహదారి

ఓబులవారిపల్లె : చిన్నపాటి వర్షానికి మండల కేంద్రం నడవలేని స్థితికి చేరుకుంటోంది. గురువారం తెల్లవారుజామున, సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి ఓబులవారిపల్లె నుండి వైకోట బాలిరెడ్డిపల్లె తదితర గ్రామాలకు వెళ్లే రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.

అన్నదానం

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : బండపల్లెలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గాలివీడు మండలం నక్కలవాండ్లపల్లెకు చెందిన సిద్దుమళ్ల పార్వతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు వీరాంజనేయులు, మల్లికార్జునలు అన్నదానం చేసినట్టు క్లబ్ సభ్యుడు మహమ్మద్ చెప్పారు.